క్లుప్తంగా

ఎమ్మెల్యే పర్వతను కలసిన శ్రీనివాస్



శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్రీనివాస్

శంఖవరం: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎంపికైన నెల్లిపూడి గ్రామానికి చెందిన నరాల శ్రీనివాస్ సోమవారం శంఖవరంలో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. పార్టీలో కష్టపడిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అత్యధిక మెజార్టీతో గెలిచేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచులు కొల్లు సత్తిబాబు, సకురు గుర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు తోట కృష్ణ, అడపా సోమేష్, నరాల తాతబ్బాయి, దూడల శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

తుని: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు చైర్ పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్టు కమిషనర్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. పట్టణాభివృద్ధికి సంబంధించి అజెండాలో పొందుపరిచిన అంశాలపై చర్చిస్తారన్నారు. 30 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి

ఏలేశ్వరం: మండలంలోని జె.అన్నవరంలో ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలంటూ స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం సీపీఐ (ఎంఎల్) వినోద్ మిశ్రా పార్టీ ఆధ్వర్యంలో దళితులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వినోద్ మిశ్రా పార్టీ ఆర్గనైజింగ్ కార్యదర్శి కొశిరెడ్డి గణేష్ మాట్లాడుతూ జె.అన్నవరంలో ప్రభుత్వ అసైన్డ్ భూమిని పేదలకు పంచాలని హైకోర్టు ఆర్డర్ వేసిందన్నారు. హైకోర్టు ఆదేశాలను అధికారులు అమలు చేయడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ చిన్నారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మసిరపు రాజారావు, ఎద్దు బుజ్జమ్మ, మాడెం బాబీ, ఎదురుపల్లి రూపులయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత



దుర్గకు వైఎస్సార్ బీమా సొమ్ము అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

గండేపల్లి: మండలంలోని నీలాద్రిరావుపేటకు చెందిన రామిశెట్టి దుర్గకు వైఎస్సార్ బీమా సొమ్మును సోమవారం గ్రామ సర్పంచ్ ములంపాక సురేష్ అందజేశారు. దుర్గ భర్త శ్రీను (32) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సహాయంగా రూ.10,000లను అందజేశారు. మిగిలిన సొమ్ములు ఆమె బ్యాంక్ ఖాతాకు జమ అవుతాయని వెల్ఫేర్ అధికారి ఎంపీడీ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దారబల్ల శివ, గ్రామ సచివాలయ కన్వీనర్ కాకి శ్రీను, నక్కా అబ్బు, వలంటీర్ జయలక్ష్మి తదితరులు ఉన్నారు.

పెద్దనాపల్లిలో అన్నదానం

ఏలేశ్వరం: మండలంలోని పెద్దనాపల్లిలో సోమవారం అన్నదానం నిర్వహించారు. గ్రామదేవత సత్తెమ్మతల్లి జాతర మహోత్సవంలో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి ముఖ్య అతిథిగా పాల్గొని భక్తులకు వడ్డన చేశారు. తొలుత అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

ప్రత్తిపాడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పరిధిలోని గ్రామాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో పది లీటర్ల సారాతో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. శంఖవరం మండలం కత్తిపూడిలో ఎద్దు రాజు, ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో వడ్డి నాని సారా విక్రయిస్తుండగా అరెస్టు చేశామన్నారు. ఒక్కొక్కరి వద్ద నుంచి ఐదేసి లీటర్ల వంతున సారా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ అశోక్ తెలిపారు.

భర్త వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

రౌతులపూడి: తన భర్త నిత్యం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని రౌతులపూడికి చెందిన నేతల కుమారి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్సై నబీ తెలిపారు.

బెంగాలీ నాట్లు... దిగుబడికి మెట్లు

- వరినాట్లు వేసేందుకు ఐదేళ్లుగా వస్తున్న పశ్చిమ బెంగాల్ కూలీలు
- తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి
- కూలీల కొరత సమస్యకు చెక్



రాచపల్లిలో వరినాట్లు వేస్తున్న పశ్చిమ బెంగాల్ కూలీలు

ప్రత్తిపాడు రూరల్: స్థానిక వ్యవసాయ కూలీలకు భిన్నంగా పశ్చిమ బెంగాల్‌కు చెందిన కూలీలు వరి నాట్లు వేస్తున్నారు. ఈ విధానంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు వస్తుండడంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. మన ప్రాంత వాసులు వేసే వరినాట్ల కంటే పశ్చిమ బెంగాల్ కూలీలు వేస్తున్న వరినాట్ల ద్వారాదిగుబడులు పెరుగుతున్నాయని రైతులు చెబుతున్నారు. దీంతో ఏటా పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి మన ప్రాంతానికి వరినాట్లు వేసేందుకు వస్తున్న కూలీల సంఖ్య పెరుగుతోంది.

21 వేల ఎకరాల్లో సాగు

ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఈ ఏడాది 21 వేల ఎకరాల్లో రైతులు ఖరీఫ్ వరి సాగు చేస్తున్నారు. దీనిలో 6,300 ఎకరాల్లో పశ్చిమ బెంగాల్‌కు చెందిన కూలీలతో వరినాట్లు వేశారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని పలు గ్రామాల్లో బెంగాలీ కూలీలు వరినాట్లు వేస్తూ దర్శనమిస్తున్నారు.

మనకు భిన్నంగా వరినాట్లు

పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన కూలీలు వరి నాట్లు వేసే విధానాన్ని గమనించి మూడేళ్ల కిందట ఖరీఫ్‌లో కొందరు రైతులు అక్కడి వారిని వరినాట్లు వేసేందుకు ఇక్కడకు తీసుకువచ్చారు. వారు వేసే వరినాట్లు శ్రీవరి సాగు, డ్రమ్ సీడర్ విధానాలను పోలి ఉండటం గమనార్హం. ఒక లైనులో మూనకు మూనకు దూరంగా వరినాట్లు వేస్తున్నారు. మన కూలీలు వరినాట్లు వేసే సమయంలో అధికంగా వరి నారును వినియోగిస్తారు. దీని వలన ఎకరానికి 70 వరి పోగులను వినియోగిస్తుంటే పశ్చిమ బెంగాల్ కూలీలు మాత్రం కేవలం 30 వరి పోగులను వినియోగిస్తున్నారు. దీని వలన వరినారు విషయంలో కూడా పెట్టుబడి తగ్గుతుందని రైతులు చెబుతున్నారు.

కూలీల కొరతకు చెక్

కూలీల కొరతతో ఇబ్బంది పడుతున్న స్థానిక రైతులకు పశ్చిమ బెంగాల్ నుంచి వస్తున్న కూలీలతో రెండు విధాలుగా మేలు జరుగుతోంది. కూలీల కొరత తీరడంతో పాటు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతోంది. ఇక్కడి కూలీలతో వరినాట్లు వేయిస్తే ఎకరాకు రూ.5 వేలు ఖర్చు కాగా, అక్కడి కూలీలతో వరి నాట్లు వేయిస్తే ఎకరాకు రూ.3900 అవుతుంది.

నాట్లు వేసేది మగవారే..

మన ప్రాంతంలో మహిళా కూలీలు మాత్రమే వరి నాట్లు వేస్తుంటారు. మగవారు వరినారు తీస్తారు. పశ్చిమ బెంగాల్ కూలీలు మాత్రం వరి నారు తీయడంతో పాటు వరినాట్లు వేయడం గమనార్హం. పురుష కూలీలు వరినారును చేతబట్టి చకచకా వరి నాట్లు వేస్తుంటారు. 13 మంది బెంగాలీ కూలీలు రోజుకు ఆరు ఎకరాల్లో వరి నాట్లు వేస్తారు.

పొట్టకూటి కోసం వచ్చాం



వరి నాట్లు వేయడానికి తెలిసిన వ్యక్తి ద్వారా పొట్టకూటి కోసం వచ్చాం. మా గ్రామంలో వ్యవసాయ పనులు చాలా తక్కువగా ఉంటాయి. వ్యవసాయేతర పనులు చేయాలంటే కలకత్తా వెళ్లాల్సి వస్తుంది. దీంతో ఉపాధి కోసం ఇక్కడకు వచ్చాం.

–సుశాంత్తా, పశ్చిబెంగాల్ కూలీ

కూలి గిట్టుబాటు అవుతోంది



మా ప్రాంతంతో పోలిస్తే ఇక్కడ కూలి గిట్టుబాటు అవుతోంది. అక్కడ పనులు లేకపోవడం వల్లే ఇక్కడకు వచ్చాం. ఇక్కడ పనులు ఎక్కువగా ఉండటంతో ఉపాధి దొరుకుతోంది. ఎకరాల చొప్పున కాంట్రాక్ట్‌కు తీసుకుని పనులు చేస్తున్నాం. రోజుకు రూ.800 వరకూ గిట్టుబాటు అవుతోంది.

–జగన్నాథ్, పశ్చిమ బెంగాల్

బెంగాలీ కూలీలతో మేలు



బెంగాలీ కూలీలతో వరినాట్లు వేయిస్తే రైతులకు మేలు జరుగుతోంది. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వస్తోంది. బెంగాలీ కూలీలతో వరి నాట్లు వేయించడం వల్ల ఎకరాకు 2–3 కాటాల దిగుబడి అదనంగా వస్తోంది. కూలీల కొరత నుంచి ఊరట లభిస్తుంది. నిర్దిష్ట సమయంలో వరినాట్లు వేస్తున్నాం.

–దంతులూరి సత్యనారాయణ రాజు, రైతు, రాచపల్లి

మన సంస్కృతి ప్రపంచానికే ఆదర్శం

రాష్ట్ర ధర్మ ప్రచారక్ సాయిరామ్



సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర ధర్మ ప్రచారక్ సాయిరామ్

తుని రూరల్: భారతీయ సంస్కృతీ సాంప్రదాయాలు ప్రపంచానికే ఆదర్శమని రాష్ట్ర ధర్మ ప్రచారక్ ముద్దు సాయిరామ్ అన్నారు. వి.కొత్తూరు శివారు బాబా రామ్‌దేవ్ జీ ఆలయంలో సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ ధర్మ ప్రచారక్ సాయిరామ్ మాట్లాడుతూ ప్రతి భారతీయుడు వేదాలు, పురాణాలు, ఇతిహాసాల గురించి తెలుసుకుంటే దేశం గొప్పతనం తెలుస్తుందన్నారు. హిందువుగా జన్మించు, హిందువుగా జీవించు, హిందూ ధర్మాన్ని రక్షించు అని పిలుపునిచ్చారు. గోదావరి జోన్ ప్రచారక్ జగన్నాథం, జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు, జిల్లా మహిళా కన్వీనర్ గంధం వెంకటలక్ష్మి, సహ కన్వీనర్ వాసంశెట్టి సూర్యావతి, తుని, పెదపూడి, కాకినాడ రూరల్ కన్వీనర్లు తంగేళ్ల అశోక్, కరెడ్ల చక్రి, పట్టాభి, తుని సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వరహాలు పాల్గొన్నారు.

ప్రత్యంగిరమాతగా వనదుర్గ అమ్మవారు



ప్రత్యంగిరమాతగా దర్శనమిచ్చిన వనదుర్గ అమ్మవారు

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారి శ్రావణమాస జాతర మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం అమ్మవారు ప్రత్యంగిర మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకూ రుత్విక్కులు నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు, బాల, కన్య, సువాసినీ పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకూ లక్ష కుంకుమార్చన, చండీహోమం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు.వేద పండితులు గొల్లపల్లి ఘనపాఠి, యనమంద్ర శర్మ, ఉపాధ్యాయుల రమేష్, ముష్టి పురుషోత్తం, చామర్తి కన్నబాబు, నాగాభట్ల రవిశర్మ తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో ధర్నా చేస్తున్న న్యాయవాదుల

ప్రత్తిపాడు: న్యాయవాదులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాది ఆవుల ప్రవీణ్ కుమార్‌పై ఈ నెల 21న జరిగిన దాడిని స్థానిక బార్ అసోసియేషన్ ఖండించింది. అలాగే వీరవల్లి పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 25న మరో న్యాయవాది సోదరుడు కిరణ్‌బాబుపై తప్పుడు కేసులు నమోదు చేయడంపై బార్ ప్రతినిధులు మండి పడ్డారు. ఈ రెండు ఘటనలను నిరసిస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య ఆధ్వర్యంలో న్యాయవాదులు విధులను బహిష్కరించారు. కోర్టు ప్రాంగణంలో నిరసన ప్రదర్శన నిర్వహించి, ధర్నా చేపట్టారు. ప్రవీణ్‌కుమార్‌పై దాడిచేసిన నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని, కిరణ్‌బాబుపై బనాయించిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. బార్ ప్రధాన కార్యదర్శి బొంగుళూరి మధుబాబు, సీనియర్ న్యాయవాదులు కొల్లా వీర్రాజు, రమణం వెంకట్రావు, రాజాల చిట్టిబాబు, పిల్లి బలరాముడు, ఏకే నాగ మల్లేశ్వరరావు, బార్ ప్రతినిదులు మళ్ల గంగాధర్, లింగంపల్లి శివకుమార్, మాదాల మంజూష తదితరులు పాల్గొన్నారు.

బీఎల్ఏ జాబితాలు సిద్ధం చేయాలి

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో బూత్ లెవెల్ అసిస్టెంట్ల (బీఎల్ఏ) జాబితాలను సిద్ధం చేయాలని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శింగిలిదేవి సత్తిరాజు కోరారు. ప్రత్తిపాడు బీజేపీ కార్యాలయంలో ఓటరు చేతన మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో 18 ఏళ్లు నిండిన యువతీయువకులను ఓటరుగా నమోదు చేయాలన్నారు. బూత్ కన్వీనర్లు ఓటరు జాబితాను క్షుణంగా పరిశీలించాలని సూచించారు. ఫారం 6, 7, 8ల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ నియోజకవర్గ సంయోజక్ దాకే కృష్ణారావు, పార్టీ నాయకులు కర్రి ధర్మరాజు, వెలుగూరి హరేరామ, కించు జోగిరాజు, గున్నాబత్తుల రాజబాబు, మదినే బాబ్జి పాల్గొన్నారు.

జ్యోతుల నెహ్రూకు పలువురి పరామర్శ

జగ్గంపేట: సోదరి వియోగంతో బాధపడుతున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ, కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను సోమవారం ఆ పార్టీ నాయకులు పరామర్శించారు. టీడీపీ నాయకులు యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, వనమాడి కొండబాబు, ఎస్వీఎస్ వర్మ, యనమల కృష్ణుడు తదితరులు ఇర్రిపాకలోని నెహ్రూ ఇంటికి వెళ్లి పరామర్శించారు. నెహ్రూ సోదరి తోట నాగలక్ష్మి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

జీఈఆర్ సర్వే పరిశీలన



తునిలో జీఈఆర్ సర్వే వివరాలు పరిశీలిస్తున్న ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ హరికృష్ణ

తుని: స్థానిక 12, 13 వార్డు సచివాలయాల పరిధిలో జరుగుతున్న గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో (జీఈఆర్) సర్వేను సమగ్ర శిక్ష, ఏఎల్ఎస్ కో ఆర్డినేటర్ కె.హరికృష్ణ సోమవారం పరిశీలించారు. వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, వార్డు వలంటీర్లు యాప్‌లో అప్‌లోడ్ చేసిన పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుని అర్బన్, రూరల్ పరిధిలో 18 సంవత్సరాల లోపు పిల్లలు 19960 మంది ఉండగా 18538 మందికి సర్వే పూర్తయిందన్నారు. పెండింగ్ సర్వేను సెప్టెంబర్ 5లోగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ సర్వే ఆధారంగా 100 శాతం పిల్లలను ఏదో బడిలో చేర్పించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు గీతాదేవి, రామకృష్ణ, సీఆర్పీ శ్యామల పాల్గొన్నారు.

హైవేపై గోవుల అక్రమ రవాణా



జాతీయరహదారిపై లారీలో గోవులను తరలిస్తున్న దృశ్యం

తొండంగి: జాతీయ రహదారిపై గోవుల అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. నిబంధనలకు విరుద్ధంగా సోమవారం తెలంగాణ రాష్ట్రానికి మినీ లారీపై కిక్కిరిసేలా గోవులను తరలించారు. హైవే పెట్రోలింగ్ అధికారులు, పోలీసులు, రవాణాశాఖ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. నిత్యం వందలాది వాహనాలపై గోవుల అక్రమ రవాణా జరుగుతున్నప్పటికీ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని జంతు ప్రేమికులు ఆరోపిస్తున్నారు. హైవేలపై సీసీ కెమెరాల ఏర్పాటు చేసినప్పటికీ అవి నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గోవుల అక్రమ రవాణాను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం



ఏలేశ్వరంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. ఏలేశ్వరం పట్టణంలోని 13, 14 వార్డుల పరిధిలో సోమవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. చంద్రబాబు హయాంలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సీఎం జగన్ నాయకత్వంతో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందన్నారు. అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లలోనే 98 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, దాకమర్రి లోవరాజు, వాగు బలరామ్, మసిరపు నాగేశ్వరరావు, జువ్విన వీర్రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో తనిఖీలు

ప్రత్తిపాడు: స్థానిక ప్రభుత్వ బీసీ బాలికల, ఎస్సీ బాలుర వసతి గృహాలను ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కాటం భాను సోమవారం రాత్రి తనిఖీ చేశారు. వసతి గృహాల్లోని వసతులపై విద్యార్థులను ఆరా తీశారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థినులకు గుడ్ టచ్, బాడ్ టచ్, దేశభక్తి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు మహనీయుల అడుగుజాడల్లో నడవాలని సూచించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, వసతిగృహాల సిబ్బంది పాల్గొన్నారు.

4న వాహనాలకు వేలం

గోకవరం: సారా కేసుల్లో పట్టుబడిన వాహనాలకు సెప్టెంబర్ 4న కోరుకొండ ఎస్ఈబీ స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహిస్తున్నట్టు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు 10 ద్విచక్ర వాహనాలకు వేలం నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం



తునిలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి, ఏలూరి బాలు

తుని: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మన మున్సిపాలిటీ–మన బాధ్యత కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి తెలిపారు. స్థానిక 16వ వార్డు గొల్లపేటలో సోమవారం ఆమె పర్యటించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వార్డు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, ఎస్సీ సెల్ కన్వీనర్ బోడపాటి శ్రీను, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా, వార్డు కౌన్సిలర్ కస్సూరి మంగ, మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

- రెండు కార్లను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- ప్రయాణికులు సురక్షితం



బస్సు ఢీకొట్టడంతో డివైడర్‌పైకి దూసుకుపోయిన కారు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు రెండు కార్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో తృటిలో పెను ప్రమాదం తప్పి ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. రోడ్డు సేఫ్టీ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. విజయవాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు విశాఖ నుంచి విజయవాడ వెళుతోంది. మండలంలోని మల్లేపల్లి శివారు పోలవరం కాలువ వద్ద హైవే మెయింటినెన్స్ సిబ్బంది రోడ్డు పనుల నిమిత్తం రోడ్డుకు మధ్యలో సేఫ్టీ కోన్స్ ఏర్పాటు చేయగా అక్కడ అదుపుతప్పి ముందు వెళుతున్న రెండు కార్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కార్ల వెనుకభాగం దెబ్బతినగా ఒక కారు డివైడర్‌పైకి దూసుకుపోయింది. అదేకారులో ఉన్న మహిళా ప్రయాణికులు, కారు డ్రైవర్లు, బస్సులో ఉన్న సుమారు 25 మంది ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాదస్థలం వద్దకు చేరుకున్న ఏఎస్సై వరకుమార్, సతీష్, హైవే సేఫ్టీ సిబ్బంది సహాయకచర్యలు చేపట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని గండేపల్లి పోలీసులు తెలిపారు.

నేరాల నియంత్రణకు ప్రజల సహకారం అవసరం

తొండంగి: నేరాలను నియంత్రించేందుకు గ్రామాల్లోని ప్రజల సహకారం ఎంతో అవసరమని తొండంగి ఎస్సై జి.వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని పైడికొండలో సోమవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తులకు సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై వీడియోలు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. మహిళలు తమ సెల్‌ఫోన్లలో దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఏఎస్సై రాయవరపు వెంకటరమణ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

రౌతులపూడి: గంజాయి, సారా వంటి మాదక ద్రవ్యాలతో పాటు కోడి పందేలు, గుండాట, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్‌నబీ తెలిపారు. మండలంలోని శృంగవరంలో సోమవారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు పోలీసులతో మమేకమై శాంతిభద్రతలకు సహకరించాలని కోరారు. సైబర్ నేరాలు, లోన్ యాప్ మోసాలు, రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలి



ఏలేశ్వరం గ్రంథాలయంలో జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

ఏలేశ్వరం: స్వాతంత్య్ర సమరయోధులను స్మరించుకోవాలని రిటైర్డ్ ఉద్యోగులు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో సోమవారం లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమం నిర్వహించారు. తొలుత జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఉద్యోగులు చెన్నా ప్రగడ సత్యగాంధీ, కోరాడ అప్పలస్వామి మాట్లాడుతూ దేశం కోసం అనేక మంది ప్రాణాలు వదిలన్నారు. దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన సమరయోధులను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉడతల రమణారావు, వాగు బాబులు, బంటుపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో నవ్యశ్రీకి ప్రథమ స్థానం



జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న నవ్యశ్రీ

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలి ఎంపీపీ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎం.నవ్యశ్రీ జిల్లా స్థాయి పోటీల్లో ప్రథమ స్థానం సాధించింది. రైజ్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆగస్టు 15ను పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు స్వాతంత్య్ర దినోత్సవంపై ఆన్‌లైన్‌లో ఇంగ్లిషు స్పీచ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో నవ్యశ్రీ జిల్లాలో ప్రథమస్థానం సాధించి సోమవారం కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా చేతులమీదుగా ప్రశంసాపత్రం, మెడల్ అందుకుంది. కార్యక్రమంలో డీఈఓ నాగమణి, పాఠశాల ఉపాధ్యాయుడు తూమురౌతు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎస్సైగా శంకర్ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై శంకర్

కోటనందూరు: స్థానిక ఎస్సైగా బి.శంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ టూటౌన్ ఎస్సైగా పని చేస్తున్న శంకర్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఎస్సైగా పని చేసిన ఎస్సై పీవీసీ స్వామినాయుడు వీఆర్‌కు వెళ్లారు. బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన ఎస్సై శంకర్‌కు సిబ్బంది స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ స్థానిక బస్టాండు సెంటర్లో ట్రాఫిక్, గంజాయి రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానన్నారు. అనంతరం ఎంపీపీ లగుడు శ్రీనివాసును మర్యాదపూర్వకంగా కలిశారు.